సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 2 । జూన్ । 2024



సోమశిలలో 7.390 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 7.390 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్‌డెల్టాకు 200, ఉత్తరకాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,250
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,650
3 శాతం జీఎస్టీతో	రూ.6,850
సవర (8 గ్రా)	రూ.54,800



భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

జిల్లాలో అంజనిసుతుడు కొలువైన క్షేత్రాలు, ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పత్రాలు, పుష్పాలతో అర్చనలు, వ్రతాలు, విశేష పూజలు నిర్వహించారు.

8లో

న్యూస్‌రీల్

పక్కాగా కౌంటింగ్ ఏర్పాట్లు

• కలెక్టర్ హరినారాయణన్



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ తెలిపారు. శనివారం రాత్రి అధికారులతో కలిసి కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఎలక్షన్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల అభ్యర్థులు కూర్చునేందుకు పబ్లిక్ రిప్రజెంటేటివ్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి 14 టేబుళ్లలో ఓట్ల లెక్కింపు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో అత్యధికంగా ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాలకు సంబంధించి 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. నెల్లూరు సిటీకి తక్కువగా 18 రౌండ్‌ల్లో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. రౌండ్ల వారీగా కౌంటింగ్ ఫలితాలను ఎన్నికల పరిశీలకుల ఆమోదం మేరకు ప్రకటిస్తామన్నారు. మీడియా, కౌంటింగ్ సిబ్బందికి భోజన వసతి, ఇతర సౌకర్యాలు కల్పించామన్నారు. కౌంటింగ్ కేంద్రం బయట, ప్రధాన రహదారిలో, పార్కింగ్ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట నెల్లూరు సిటీ, కోవూరు, నెల్లూరు రూరల్ రిటర్నింగ్ అధికారులు వికాస్‌మర్మత్, సేతు మాధవన్, మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

6న జాబ్ మేళా

నెల్లూరు(టౌన్): రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఇంటర్ బోర్డు హెచ్‌సీఎల్, టెక్‌బీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్‌ఐఓ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. ఇంటర్‌లో 75 శాతంతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. మాథ్స్ మినహా అన్ని గ్రూపుల విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనే అవకాశముందన్నారు. జాబ్‌మేళాకు సంబంధించి నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఎంపిక ప్రక్రియలో క్యాట్ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ మాత్రమే ఉంటుందన్నారు. హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులు, హెచ్‌సీఎల్ నుంచి టెక్‌బీ ప్రోగ్రాంలో చేరేందుకు ఆఫర్ లెటర్ ఇస్తారన్నారు. టెక్‌బీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఏడాది పాటు ఉంటుందని, మొదటి మూడు నెలలు క్లాస్ రూమ్ ట్రైనింగ్ మధురైలో ఉంటుందన్నారు. చివరి 9 నెలలు ఇంటర్న్ షిప్ కోసం చెన్నై హెచ్‌సీఎల్ కాంపస్‌కు వెళ్లాల్సి ఉందన్నారు. ఇంటర్న్ షిప్ సమయంలో అభ్యర్థికి రూ.10 వేలు చొప్పున ఉపకార వేతనం ఇస్తారని తెలిపారు. ట్రైనింగ్ పూర్తి చేసిన అభ్యర్థికి సంవత్సరానికి రూ.1,70,000 ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 77803 23850 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 350

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.350 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 704 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 593 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 111 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 350, కనిష్ట ధర రూ. 205 లభించగా, సగటున రూ.300.83 ధర లభించిందన్నారు. వేలంలో 15 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 609 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శనివారం 609 పొగాకు బేళ్లు విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 716 బేళ్లు రాగా వాటిలో 609 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 69,826 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,93,94,721 వ్యాపారం జరిగింది. కిలో పొగాకు ధర గరిష్ఠంగా రూ.352, కనిష్ఠంగా రూ.204 లభించింది. సగటు ధర రూ.277.76గా నమోదైంది. వేలంలో 21 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

నిఘా నీడన ఓట్ల లెక్కింపు

కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. సీసీ కెమెరాలు, డ్రోన్‌లు, బాడీ వార్న్ కెమెరాలు, పోలీసు నిఘా నీడన ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పోలీసు బాస్ ఆరిఫ్ హఫీజ్ పటిష్ట భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రమైన ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తూనే మరో వైపు జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని పోలీసు అధికారులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. అల్లర్లకు పాల్పడి పోలీసు కేసుల్లో ఇరుక్కోవద్దని సూచిస్తున్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

- బందోబస్తు విధుల్లో 2000 మంది
- 300పైగా ప్రాంతాల్లో పోలీసు పికెట్లు
- అభ్యర్థుల నివాసాలు, పార్టీ కార్యాలయాల వద్ద భద్రత
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలు
- విజయోత్సవ ర్యాలీలు నిషేధం



శనివారం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

నెల్లూరు (క్రైమ్): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర బలగాలు, ఏపీఎస్పీతో పాటు స్థానిక పోలీసు అధికారులు సుమారు 650 మందికి పైగా సిబ్బంది అక్కడ బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వీడియో గ్రాఫర్‌ను నియమిస్తున్నారు. ప్రతి అంశం కెమెరాలో నిక్షిప్తం అయ్యేలా చర్యలు చేపట్టారు. ప్రధాన గేట్ల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు, కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే లోనికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. మహిళల కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్‌ను అమలు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు రెండు కిలో మీటర్ల పరిధి వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించారు. డ్రోన్లు, బెలూన్లు ఎగరవేయడం నిషేధించారు. కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, ఏజెంట్లు, అభ్యర్థులకు జిల్లా ఎన్నికల అధికారి/ఈసీ ఇచ్చిన పాస్ ఉంటేనే హాల్లోకి అనుమతిస్తారు. రిటర్నింగ్ అధికారులు మినహా ఇతరులెవరూ కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు వీలులేదు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు కేంద్రం బయట ఏర్పాటు చేసే డిపాజిట్ కేంద్రంలో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తదితరాలను అప్పగించాలి.

అభ్యర్థుల ఇళ్లు, పార్టీ కార్యాలయాల వద్ద భద్రత

ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అభ్యర్థుల ఇళ్లు, పార్టీ కార్యాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. అభ్యర్థులకు భద్రతను పెంచేలా చర్యలు చేపట్టారు. ఈ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచాలను కాల్చడం నిషేధించారు. ఎన్నికల వేళ అల్లర్లకు పాల్పడినా, ఎంసీసీ ఉల్లంఘించినా చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

జిల్లా వ్యాప్తంగా 300కుపైగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచారు. వాటితో పాటుగా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లల్లో శనివారం నుంచే పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు అధికారులు ఆయా ప్రాంతాల్లో రౌండ్ ది క్లాక్ గస్తీ నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌ను ఇప్పటికే బైండోవర్లు చేశారు. వారి కదలికలపై నిఘా ఉంచారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు.

పార్కింగ్ ప్రదేశాలివే

కనుపర్తిపాడులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ కేంద్రంను ఏర్పాటు చేశారు. ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది నిర్దేశిత పార్కింగ్ కేంద్రంలో వాహనాలను పార్క్ చేయాలి. అక్కడ నుంచి ప్రత్యేక బస్సుల్లో కౌంటింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్తారు. అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు వస్తారు. అక్కడ వాహనాలు దిగి నడుచుకుంటూ లోనికి వెళ్లాల్సి ఉంటుంది. ఆ వాహనాలు సైతం పార్కింగ్ కేంద్రంలోనే పార్క్ చేయాల్సి ఉంది. ఎన్నికల కౌంటింగ్ రోజున ట్రాఫిక్ డైవర్షన్ చేస్తున్నారు. ఎస్పీ నిరంతరం సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

అభ్యర్థులు ఏజెంట్లు పాటించాల్సిన నిబంధనలు

- 4వ తేదీ ఉదయం 6 గంటల కల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి
- కలెక్టర్/ఆర్‌ఓ ఇచ్చిన గుర్తింపు కార్డును కలిగి ఉండాలి
- పార్టీ కార్యకర్తలను ఎవరిని కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకురాకూడదు
- కౌంటింగ్ కేంద్రాల బయట, రోడ్లపై విజయోత్సవ ర్యాలీలు నిషేధం. బాణసంచా కాల్చరాదు
- ఫంక్షన్ హాల్స్, హోటల్స్‌లో జనసమీకరణ చేయరాదు
- వాట్సాప్ గ్రూప్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదు.
- ఇతర పార్టీ కార్యాలయాలు, నాయకుల ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు దిగరాదు
- ఓడిపోయిన అభ్యర్థులపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయరాదు
- జూన్ 6వ తేదీ వరకు ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదు
- ఎంసీసి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు

అందరూ సహకరించాలి

కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, పక్కాగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశాం. పోలీసు బలగాలతో పాటు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశాం. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిగేందుకు అందరూ సహకరించాలి. గెలుపు, ఓటములు సహజమన్న విషయాన్ని గుర్తించి సంయమనం పాటించాలి. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడాలు నిషేధం. ఏజెంట్లు తప్పని సరిగా ఐడీ కార్డుతో పాటు ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలి. సెల్ ఫోన్లు తీసుకురాకూడదు. తెల్ల కాగితం, బాల్ పెన్ మాత్రమే లోనికి అనుమతిస్తారు. కనుపర్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేశాం.

– కె.ఆరిఫ్ హఫీజ్

కౌంటింగ్ కేంద్రంలో నిరంతరం విద్యుత్



ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ అధికారులకు సూచనలిస్తున్న సీఎండీ సంతోషరావు

- అదనపు సిబ్బందితో మూడు షిఫ్ట్‌లు ఏర్పాటు
- కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలించిన సీఎండీ

నెల్లూరు (వీఆర్సీసెంటర్): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు శనివారం పరిశీలించారు. ఈ నెల 4న కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా నిరంతరం ఉండేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలకు మూడు షిఫ్ట్ పద్ధతుల్లో విద్యుత్ అధికారులను, సిబ్బందిని నియమించి ఇప్పటికే నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను అందిస్తున్నామన్నారు. 220 కేవీ, 132 కేవీ, 33 కేవీ సబ్‌స్టేషన్లకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి అధికారులు విధుల్లో ఉంటారని, 4వ తేదీన ఎలాంటి చిన్న అంతరాయం రాకుండా చూడాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. సీఎండీ వెంట జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు గంగాధర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అశోక్, భానూనాయక్, అసిస్టెంట్ ఇంజినీర్ లక్ష్మి, సిబ్బంది, పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

• ఎస్పీ కె. ఆరిఫ్ హఫీజ్



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు (క్రైమ్): ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు మూడంచెల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ కె. ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. శనివారం ఆయన కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం, జెడ్పీ హైస్కూల్‌లోని పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారి/ఆర్‌ఓ ఇచ్చిన గుర్తింపు కార్డులున్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని, ఏజెంట్లు తప్పనిసరిగా ఐడీ కార్డుతో పాటు ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలన్నారు. సెల్ ఫోన్లకు అనుమతి లేదని చెప్పారు. తెల్ల కాగితం, బాల్‌పెన్ మాత్రమే అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా సంబంధిత ఆర్‌ఓను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలపాలన్నారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలను రెడ్‌జోన్‌గా గుర్తించామని, ఎవరూ డ్రోన్‌లు, బెలూన్లు ఎగురవేయరాదన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ, ఎలక్షన్ సెల్, నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్లు కె. రామకృష్ణారెడ్డి, ఎం. నాగేశ్వరమ్మ, మారుతీకృష్ణ తదితరులున్నారు.

ఉత్కంఠగా ఆఖరి ఘట్టం

కౌంటింగ్‌కు మిగిలింది 48 గంటలే..

- 2019 ఫలితాలు ప్రతిబింబిస్తాయని ధీమా
- ఇప్పటికే కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- చివరి క్షణంలో భారీగా బెట్టింగ్‌ల జోరు
- రాజకీయ పార్టీల్లోనే కాకుండా.. జనాల్లోనూ టెన్షన్

సార్వత్రిక ఎన్నికల ఆఖరి ఘట్టం కౌంటింగ్ ప్రక్రియకు కేవలం 48 గంటల సమయమే మిగిలి ఉంది. అయితే 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని వైఎస్సార్‌సీపీ ధీమా వ్యక్తం చేస్తుండగా, టీడీపీ ఊహల పల్లకిలో ఊగిసలాడుతోంది. గత ఎన్నికల కంటే ఈ దఫా ఎన్నికల్లో 2.39 శాతం పోలింగ్ పెరిగింది. ఈ దఫా పోలింగ్ సరళి, ఓటింగ్ శాతాన్ని బట్టి వైఎస్సార్‌సీపీకి అనుకూలమనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో జిల్లాలో బెట్టింగ్ రాయుళ్లు ఎమ్మెల్యే అభ్యర్థుల విజయం, ప్రభుత్వంపై భారీగా బెట్టింగ్‌లు కడుతున్నారు. దీంతో కౌంటింగ్ సమయం దగ్గర పడే కొద్దీ రాజకీయ పార్టీల్లోనే కాకుండా ఓటర్లలోనూ టెన్షన్‌తో పల్స్ రేటు పెరిగిపోతోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్‌సీపీ మరోసారి క్లీన్ స్వీప్ చేయబోతుందని ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉంటే.. టీడీపీ శ్రేణులు డీలా పడ్డాయి. ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమం, అభివృద్ధి, ప్రజాభిమానాన్ని వైఎస్సార్‌సీపీ నమ్ముకుంటే.. టీడీపీ కేవలం విచ్చలవిడిగా రూ.వందల కోట్లు ఖర్చు చేసి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాన్ని నమ్ముకుంది. 2019 ఎన్నికల్లో ప్రస్తుత జిల్లా పరిధిలో నియోజకవర్గాల వారీగా పోలింగ్ పర్సంటేజీ చూస్తే 77.61 శాతం ఉండగా, తాజా ఎన్నికల్లో 80 శాతం ఓటింగ్ జరిగింది. గత ఎన్నికల కంటే.. 2.39 శాతం పెరిగింది. గతంలో ఉమ్మడి జిల్లాలో తీసుకుంటే 10 అసెంబ్లీ, నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఆ ఎన్నికల్లో కావలి, నెల్లూరు సిటీ నియోజకవర్గాల్లో 50 శాతం లోపు ఓట్ షేర్‌ను సొంతం చేసుకుంటే.. మిగతా నియోజకవర్గాల్లో 51 నుంచి 57 శాతానికిపైగా ఓట్ షేర్‌తో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలుపొందారు. కొత్త జిల్లాలో 8 అసెంబ్లీతో పాటు నెల్లూరు పార్లమెంట్ స్థానంలో గతంలో కంటే మిన్నగా ఓట్ షేర్‌ను వైఎస్సార్‌సీపీ సొంతం చేసుకోబోతుందని ఎగ్జిట్ పోల్ సంస్థలు సైతం నిర్ధారించాయి.

గ్రామీణ మహిళలు, వృద్ధులు వైఎస్సార్‌సీపీకే..

సార్వత్రిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, వృద్ధులు అధిక శాతం మంది వైఎస్సార్‌సీపీ అండగా నిలిచారని అభిప్రాయం వ్యక్తం చేశాయి. జిల్లాలో నెల్లూరు ఎంపీ, 8 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఓట్ల లెక్కింపునకు సుదీర్ఘ సమయం ఉండడంతో అందరిలోనూ ఒకటే టెన్షన్. ఎక్కడ చూసిన ఫలితాలు ఎలా ఉంటాయనే చర్చ జరిగింది. ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతున్న కొద్దీ అందరిలో పొలిటికల్ ఫీవర్ తార స్థాయికి చేరుకుంది. ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడడంతో పార్టీల నేతలందరు జిల్లాకు చేరుకుంటున్నారు.

చకాచకా ఏర్పాట్లు

ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పూర్తి చేస్తోంది. నెల్లూరు పార్లమెంట్, 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించనున్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా రౌండ్లు ఉంటాయి. కౌంటింగ్‌కు ఏజెంట్ పాస్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. స్ట్రాంగ్ రూమ్స్‌ను కలెక్టర్, ఎస్పీ నిత్యం పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు.

గెలుపుపై అభ్యర్థుల ధీమా

సార్వత్రిక ఎన్నికల్లో విజేతలు ఎవరు.. పరాజితులు ఎవరు ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది.. యువత, మహిళలు, వృద్ధులు ఎవరికి పట్టం కట్టారో ఇటువంటి ప్రశ్నలకు ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలోపు పూర్తి స్పష్టత రానుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు మాత్రం అంచనాలు వేసుకుని గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా పోలింగ్ సరళి, పెరిగిన శాతం, ప్రధానంగా మహిళల ఉత్సాహంపై విశ్లేషణలతో బెట్టింగ్‌లు జోరందుకున్నాయి.

2019 ఎన్నికల్లో జిల్లాలో ఫలితాలు

నియోజకవర్గం	గెలిచిన పార్టీ	మెజార్టీ	పోలింగ్ శాతం	ఓట్ షేర్
కోవూరు	వైఎస్సార్‌సీపీ	39,769	77.35	56.54
ఉదయగిరి	వైఎస్సార్‌సీపీ	36,081	80.37	57.30
ఆత్మకూరు	వైఎస్సార్‌సీపీ	22.963	83.38	53.21
నెల్లూరు రూరల్	వైఎస్సార్‌సీపీ	19.510	65.22	51.21
సర్వేపల్లి	వైఎస్సార్‌సీపీ	13,866	82.18	51.36
కందుకూరు	వైఎస్సార్‌సీపీ	14,936	89.47	51.69
కావలి	వైఎస్సార్‌సీపీ	13,817	76.35	49.12
నెల్లూరు సిటీ	వైఎస్సార్‌సీపీ	1641	66.30	47.38

ఖోఖోలో పిడుగులు

- ఒడిశాలోని జాతీయ అకాడమీకి అర్హత
- జిల్లా నుంచి మొదటిసారి ఘనత

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): క్రీడా ప్రతిభను పేదరికం ఆపలేకపోయింది. తల్లిదండ్రులు క్రీడా రంగానికి చెందిన వారు కాకపోయినా ఈ బాలికలు దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ఒడిశాలోని ఖోఖో జాతీయ అకాడమీకి ఎంపిక య్యారు. నగరంలోని బాలసదన్‌లో ఉంటూ ఖోఖోలో రాణిస్తూ జిల్లాకు గర్వకారణమయ్యారు.



అత్యుత్తమ ప్రతిభ



నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సమ్మర్ కోచింగ్ క్యాంపునకు రెండో తరగతి చదువుతున్న సమయంలో భవానీ హాజరయ్యారు. తల్లిదండ్రులు సులోచన, రామప్పాచారి కూలీలే. చిన్నారిలోని ప్రతిభను గుర్తించిన ఖోఖో కోచ్ సుకుమార్ క్రీడలో మెళకువలు నేర్పారు. ప్రస్తుతం భవానీ ఎనిమిదో తరగతి చదువుతోంది. రెండు జాతీయస్థాయి పోటీలు, ఏడు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అబ్బురపర్చారు. ఆర్థికంగా సతమతమవుతుండటంతో బాలసదన్ ఆశ్రమంలో చేర్పించి చదువుల్లో రాణించేలా చేశారు.

జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



ఏడో తరగతి చదువుతున్న సమయంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో ఖోఖో నేర్చుకునేందుకు రమ్య హాజరయ్యారు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అత్యంత శ్రద్ధతో క్రీడా మెళకువలు నేర్చుకొని మూడు నేషనల్స్, రాష్ట్రస్థాయిలో 17 పోటీల్లో పాల్గొంది. ఛత్తీస్‌ఘఢ్‌లో నిర్వహించిన ఆలిండియా చాంపియన్‌షిప్, మహారాష్ట్రలో నిర్వహించిన అండర్ – 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభను చూపారు. తమిళనాడులో నిర్వహించిన ఖేలో ఇండియా సౌత్‌జోన్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించారు.

ప్రతిభను గుర్తిస్తాం



జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనే చిన్నారుల ప్రతిభను గుర్తిస్తాం. ఆర్థికంగా వెనుకబడిన వారే శిక్షణ శిబిరాలకు హాజరవుతారు. వీరిని గుర్తించి తగిన ప్రోత్సాహాన్ని అందిస్తాం. క్రీడల్లో ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహిస్తాం. జాతీయ స్థాయిలో వీరు రాణించడం గర్వకారణం.

– యతిరాజ్, డీఎస్డీఓ

పట్టుదలకు నిదర్శనం



ఈ బాలికలు ఆర్థికంగా వెనుకబడినా క్రీడపై ఉన్న ఆసక్తి వారిని జాతీయ స్థాయిలో రాణించేలా చేసింది. ఒడిశాలోని ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఖోఖో అకాడమీలో ప్రవేశం లభించింది. అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో పాల్గొనాలనేదే వీరి లక్ష్యం. ఖోఖో అసోసియేషన్ నేతలు గిరిప్రసాద్, గురుప్రసాద్, విజయ్‌కుమార్ వీరికి క్రీడా, విద్యాపరమైన సౌకర్యాలను కల్పించారు. ఐసీడీఎస్ బాలసదన్ నిర్వాహకులు ఎంతో ప్రోత్సహించారు. క్రీడా ప్రావీణ్యం వీరిని జిల్లా నుంచి మొదటిసారిగా జాతీయ అకాడమీకి ఎంపికయ్యేలా చేసింది.

– సుకుమార్, ఖోఖో కోచ్

ముమ్మరంగా తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా జిల్లాలో కార్డన్ సెర్చ్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోని కండలేరు, సైదాపురం, దగదర్తి, ఉలవపాడు, కలిగిరి, కొండాపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, ఉదయగిరి, సీతారామపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల సమస్యాత్మక ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో తనిఖీలను పోలీస్ అధికారులు శనివారం నిర్వహించారు. సరైన పత్రాల్లేని 28 బైక్‌లు, అక్రమంగా నిల్వ ఉంచిన 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలతో కొండాపురం పోలీసులు

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30



స్వర్ణకవచ అలంకారంలో ఆంజనేయుడు



నెల్లూరు(బృందావనం): నగరంలోని సుజాతమ్మ కాలనీలో గల కార్యసిద్ధి ఆంజనేయస్వామి మందిరంలో హనుమజ్జయంతి ఉత్సవాలను అవధూత దత్తపీఠం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, నాగవల్లీ దళాలతో అర్చన, హోమాన్ని జరిపారు. పల్లకిసేవను వేడుకగా నిర్వహించారు. స్వామివారు స్వర్ణకవచ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు, డాక్టర్ రాంబాబు, రామచంద్రగుప్తా కుటుంబసభ్యులు వ్యవహరించారు. మందిర ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, అవధూత దత్త పీఠం నెల్లూరు శాఖ ట్రస్టీలు మస్తాన్‌రెడ్డి, ఫణిరత్నం, పీసీ రత్నం తదితరులు పాల్గొన్నారు.



మలేరియా రహిత సమాజానికి కృషి



అవగాహన ర్యాలీలో అధికారులు

నెల్లూరు(అర్బన్): మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి వివిధ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దోమలు కుట్టడంతో మలేరియా వ్యాధి వస్తుందని చెప్పారు. అనంతరం మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ మాట్లాడారు. ప్రజలు తమ ఇళ్ల సమీపంలో నీటి గుంతల్లేకుండా చూసుకోవాలని కోరారు. తొలుత మలేరియా వ్యాధి నిర్మూలనపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వర్మ, నాగార్జున, నందా తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై కామాక్షితాయి

కోవూరు: బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవారు సింహవాహనంపై శనివారం దర్శనమిచ్చారు. విశేష పూజలను వేదపండితులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఆలయ వీధుల్లో ఊరేగించారు. ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి రెండేళ్ల జైలు

ఉదయగిరి: విధి నిర్వహణలో ఉన్న మహిళా ఉద్యోగిని దుర్భాషలాడిన కేసులో పెరుమాళ్ల తిరుపతయ్యకు రెండేళ్ల జైలు శిక్షను విధిస్తూ ఉదయగిరి సివిల్ కోర్టు న్యాయమూర్తి అంజయ్య శనివారం తీర్పుచెప్పారు. ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి వివరాల మేరకు.. గత ఎన్నికల్లో భాగంగా జీ అయ్యవారిపల్లి పోలింగ్ బూత్‌లో మహిళా హోంగార్డు పార్వతి విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో దేకూరుపల్లికి చెందిన తిరుపతయ్య మద్యం మత్తులో పోలింగ్ కేంద్రంలోకి వెళ్తూ ఆమెను దుర్భాలాషలాడి చేతితో నెట్టారు. ఘటనపై పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి పైమేరకు శిక్ష విధించారు.

కావలిలో చోరీ

కావలి: పట్టణంలోని కోర్టు వీధిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శనివారం వేకువజామున చోటుచేసుకుంది. వివరాలు.. స్థానికంగా విశ్రాంత ఉద్యోగి సుబ్రహ్మణ్యం నివాసం ఉంటున్నారు. చల్లగాలి కోసం తలుపులు తీసి ఉండటాన్ని గుర్తించిన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి భార్యాభర్తలను బెదిరించారు. సుబ్రహ్మణ్యం భార్య మెడలోని చైన్‌తో పాటు పది సవర్ల బంగారు ఆభరణాలను అపహరించారు. అనంతరం బైక్‌పై పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.